సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 21 । డిసెంబర్ । 2023



శ్రీవారి గ్రామోత్సవం

ద్వారకాతిరుమల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. అడుగడుగునా భక్తులు నీరాజనాలు అర్పించారు.



నేడు ఫుట్‌బాల్ పోటీలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో నన్నయ వర్సిటీ అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ పోటీలు గురువారం జరుగనున్నాయి.



కొనసాగిన రద్దీ

ఉంగుటూరు: కైకరంలో సుబ్రహ్మణ్య షష్ఠి తిరునాళ్లు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి తిరునాళ్లకు భక్తుల రాక మరింత పెరిగింది.

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి కౌశల్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

భీమవరం: స్థానిక డీఎన్నార్ కాలేజీలో నిర్వహించిన జిల్లాస్థాయి కౌశల్–2023 క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. బుధవారం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్విజ్‌లో ఆచంట మండలం మటపర్తివారిపాలెం హైస్కూల్, తణుకు జెడ్పీ బాయిస్ హైస్కూల్ విద్యార్థులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్ జనరల్ థీమ్‌లో కొమ్ముచిక్కాల హైస్కూల్, అత్తిలి హైస్కూల్, ఐసీఎస్‌లో కొమ్ముచిక్కాల హైస్కూల్, మటపర్తివారిపాలెం హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్వీ సూర్యనారాయణ, డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు బాబు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, ప్రిన్సిపాల్ అంజిన్‌కుమార్ పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా రెవెన్యూ శాఖలో సాధారణ ఎన్నికల నిమిత్తం మూడు డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను పొరుగు సేవల పద్ధతిలో భర్తీ చేస్తున్నామని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎస్టీ అభ్యర్థులు మాత్రమే అర్హులని కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ, బీటెక్, బీసీఏ, ఎంసీఏ పూర్తిచేసిన వారు లేదా గుర్తింపు పొందిన సంస్థ నుంచి పీజీడీసీఏ సర్టిఫికెట్‌తో ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. వివరాలను http://westgodavari.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు ఈనెల 24 చివరి తేదీ అని, 18 నుంచి 42 ఏళ్ల లోపు వారు అర్హులని ఆమె పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు వరం

కలెక్టర్ ప్రశాంతి



జగనన్న విదేశీ విద్యాదీవెన చెక్కు అందిస్తున్న కలెక్టర్

భీమవరం: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం పేద విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం భీమవరం కలెక్టరేట్‌లో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంలో లబ్ధిదారులకు ఆమె చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పేద విద్యార్థులు సైతం విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించడంతో పాటు సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన యూనివర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం బాసటగా నిలవడం, సివిల్స్ చదివే వారికి సాయంగా ప్రోత్సాహం అందించడం విశేషమన్నారు. విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న జిల్లాలో ఎనిమిది మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లిదండ్రులకు రూ.60.76 లక్షలు, సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఐదుగురు అభ్యర్థులకు ప్రోత్సాహకంగా రూ.5 లక్షల నమూనా చెక్కులను అందజేశారు. ఆయా మొత్తాలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. డీఆర్వో బి.శ్రీమన్నారాయణరెడ్డి, జిల్లా వార్డు, సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి జి.గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్‌మీట్



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న జట్లు

పెంటపాడు: ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ 2023–24 రీజినల్ మీట్‌లో భాగంగా తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద జరుగుతున్న పోటీలు బుధవారం రెండో రోజుకు చేరాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఫణీంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో పోటీలు జరుగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 11 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 400 మంది క్రీడాకారులు తరలివచ్చి ఉత్సాహంగా పోటీల్లో తలపడుతున్నారు. పోటీల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఫణీంద్రప్రసాద్ తెలిపారు. రీజనల్ మీట్‌లో భాగంగా కబడ్డీ పోటీలు నువ్వానేనా అన్నట్టు సాగాయి. పలు కళాశాలల అధ్యాపకులు, పీడీలు పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

22న తణుకులో జాబ్‌మేళా

భీమవరం: తణుకు చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి తెలిపారు. తణుకు సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్, రిలయన్స్ నిప్పన్ ఇన్సూరెన్స్, పేటీఎం కంపెనీల్లో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ వంటి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు వారు అర్హులని, వివరాలకు సెల్ 96185 60188 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సందేశాత్మకంగా నాటిక పోటీలు

వీరవాసరం: తోలేరులో సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో పసుపులేటి నాగేశ్వరరావు కళాప్రాంగణంలో జాతీయస్థాయి నాటికల పోటీలు బుధవారం సందేశాత్మకంగా సాగాయి. చైతన్య కళాభారతి కరీంనగర్ కళాకారులు చీకటి పువ్వు నాటిక ప్రదర్శించారు. దీనికి రచనా సహకారం పి.శివరాం, దర్శకత్వం మంచాల రమేష్ వహించారు. అలాగే శర్వాణి గిరిజన, సాంస్కృతిక సేవా కేంద్రం బోరివంక కళాకారులు కొత్త పరిమళం నాటిక ప్రదర్శించారు. రచనా సహకారం కేకేఎల్ స్వామి అందించగా, దర్శకత్వం బీఎంఎస్ పట్నాయక్ వహించారు.

క్లుప్తంగా

ఏపీ నిట్‌కు పురస్కారం



అవార్డును అందుకుంటున్న ఏపీ నిట్ అధ్యాపకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏపీ నిట్‌కు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఇంధన పరిరక్షణ 2023 అవార్డు (సిల్వర్ మెడల్) వచ్చింది. నిట్ సంస్థ భవన సముదాయాలపై సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి సమర్థవంతమైన ఎయిర్ కండిషనర్ల ద్వారా విద్యుత్తును ఆదా చేసి బిల్లులను తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని మెచ్చుకుని ఏపీ రాష్ట్ర ఇంధన శాఖ ఏపీ నిట్‌ను ఎంపిక చేసింది. విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ జెన్ కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్, చక్రధర బాబులు చేతుల మీదుగా అవార్డును నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ వుద్దంట సందీప్, డాక్టర్ తేజావతు రమేష్‌లు అందుకున్నారు. ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డాక్టర్ ఎన్.జయరామ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

స్త్రీ నిధి డైరెక్టర్‌గా కృపామణి



కొయ్యలగూడెం: ఆంధ్రప్రదేశ్ స్త్రీ నిధి రాష్ట్ర డైరెక్టర్‌గా తోట కృపామణి నియమితులయ్యారు. ఈ మేరకు స్త్రీ నిధి ఎండీ నాంచారయ్య ఆదేశాలు జారీ చేశారు. కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురం గ్రామానికి చెందిన తోట కృపామణి ఇప్పటికే కొయ్యలగూడెం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్నారు. ఏలూరు జిల్లా నుంచి రాష్ట్ర డైరెక్టర్‌గా తోట కృపామణిని ఎంపిక చేశారు. తాను మరింత బాధ్యతతో పని చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి పాటు పడతానని కృపామణి అన్నారు. ఈ అవకాశం కల్పించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ్‌రాజు, డీఆర్‌పీలు విజయ కుమారి, అనిత, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ శశి కుమార్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

మోసానికి పాల్పడుతున్న బాలుడి పట్టివేత

కామవరపుకోట: గత కొన్ని నెలలుగా కామవరపుకోటలో షాపు యజమానులను మోసం చేస్తున్న మహారాష్ట్రకు చెందిన ముఠాలోని బాలుడిని గ్రామస్తులు పట్టుకుని తడికలపూడి పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం గత కొన్ని నెలలుగా ఇతర రాష్ట్రాలకు చెందిన యువకులు షాపు దగ్గరకు వచ్చి యజమానులను రకరకాల వస్తువులు కావాలని తికమక పెట్టి.. 500 నోటు ఇచ్చినట్లుగానే నమ్మించి, తిరిగి డబ్బులు వసూలు చేసి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గత గురువారం ఇదే తరహాలో ఒక యువకుడు సుమారు 15 షాపుల వద్ద మోసానికి పాల్పడినట్లు తెలిపారు. బుధవారం స్థానిక సెయింట్ మేరీ స్కూల్ ఎదురుగా గల షాప్ దగ్గరకు ఆ బాలుడు వెళ్లగా.. గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

రేపు శ్రీవారి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

- శరవేగంగా జరుగుతున్న ఏర్పాట్లు
- మధ్యాహ్నం 2 గంటలకు పాదుకా మండపం వద్ద ప్రారంభం
- 23న ఉదయం 4.30 నుంచి ఉత్తర ద్వార దర్శనం



శ్రీవారు, అమ్మవార్లు



గిరి ప్రదక్షిణ మార్గాన్ని చదును చేస్తున్న రోలర్



శ్రీవారి ధర్మ ప్రచార రథం

ద్వారకాతిరుమల: శ్రీవారి గిరి ప్రదక్షిణ మహోత్సవం ఈనెల 22న నేత్రపర్వంగా జరగనుంది. స్వామివారి వైభవాన్ని చాటేలా గజ, అశ్వ, వృషభ సేవలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్చరణలు, భక్తుల గోవింద నామస్మరణలు, శ్రీవారి ధర్మ ప్రచార రథం, కోలాట భజనల నడుమ శుక్రవారం ఈ వేడుకను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి పర్వదినం ముందు రోజు ఈ ఉత్సవాన్ని జరపడం సంప్రదాయంగా వస్తోంది. ఈ క్రమంలోనే ఈ ఏడు కూడా గిరి ప్రదక్షిణను అంగరంగ వైభవంగా జరపనున్నారు. మరుసటి రోజు 23న జరగనున్న స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి క్షేత్రంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పనులను ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు, ఈఈ డీవీ భాస్కర్‌లు పర్యవేక్షిస్తున్నారు. శ్రీవారి గిరి ప్రదక్షిణ వేడుక శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరుగనుంది. తొలుత స్వామివారి పాదుకా మండపం వద్ద ఈ కార్యక్రమాన్ని ఆలయ అధికారులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభిస్తారు. అనంతరం ఈ యాత్ర మల్లేశ్వరం (దొరసానిపాడు రోడ్డు) మీదుగా కొండ పైకి చేరుతుంది. అక్కడి నుంచి ఉగాది మండపం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. ఆ తరువాత ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ అధికారులు స్వామివారి నిజరూప దర్శన భాగ్యాన్ని కల్పిస్తారు. మరుసటి రోజు 23న ఉదయం 4.30 గంటల నుంచి శ్రీవారు ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమిస్తారు.

భక్తులకు అందే సేవలు ఇవీ..

5 కిలోమీటర్లు మేర సాగే ఈ గిరి ప్రదక్షిణలో భక్తులకు దేవస్థానం అన్ని సౌకర్యాలను కల్పించనుంది. మార్గం మధ్యలో మంచినీళ్లు, పండ్లు, టిఫిన్లు, టీలు అందించేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంబులెన్స్‌ను, నడవలేని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఉచిత బస్సును ఏర్పాటు చేయనుంది.

జరుగుతున్న ఏర్పాట్లు ఇవీ..

గిరి ప్రదక్షిణ నిమిత్తం కొండ చుట్టూ 5 కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేసి శుభ్రం చేస్తున్నారు. భక్తులు సేదతీరేందుకు మార్గ మధ్యంలో టెంట్లు నిర్మించనున్నారు. భక్తులు శ్రీవారిని దర్శించేందుకు వీలుగా ఆలయ ఆవరణలో తాత్కాలిక క్యూలైన్లను నిర్మిస్తున్నారు. ఉత్తర ద్వారాలను ముస్తాబు చేయడంతో పాటు, విద్యుద్దీప అలంకారాల పనులు తుది దశకు చేరుకున్నాయి. గోవింద స్వాములు ఇరుముడులు సమర్పించే ప్రాంతంలో తాత్కాలిక పందిళ్లను, హోమగుండాన్ని నిర్మించనున్నారు.

క్షీరారామలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో లెక్కిస్తున్న హుండీ ఆదాయం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయం రూ. 22,63,834 వచ్చింది. బుధవారం దేవదాయ శాఖ తనిఖీ అధికారి వర్దినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలు లెక్కించారు. అన్నదానం హుండీ నుండి రూ. 21,099 రాగా మొత్తం రూ. 22,84,933లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, వీఆర్వో సుబ్బారావు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది, రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగులు, వివిధ సేవా సంస్థల సభ్యులు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో దూకిన నవ దంపతులు

వధువు గల్లంతు



ఈ నెల 15వ తేదీన అన్నవరప్పాడులో వివాహం చేసుకున్న జంట

పెనుగొండ: ఏ కష్టం వచ్చిందో తెలియదు. నవ దంపతులు గోదావరిలో దూకారు.. వరుడు ప్రాణాలతో బయట పడగా.. వధువు గల్లంతయ్యింది. అయితే వరుడుపై వధువు బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వడలి గ్రామానికి చెందిన కోరాడ సత్యవతి(19)ని తండ్రి లేకపోవడంతో తాతే పెంచి ఈ నెల 15న ఉండ్రాజవరం మండలం మోర్తకు చెందిన కే శివరామకృష్ణతో వివాహం జరిపించాడు. వీరు మంగళవారం రావులపాలెం సినిమాకు అని చెప్పి వెళ్లారు. శివరామకృష్ణ కథనం ప్రకారం ఇద్దరూ సిద్ధాంతం బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బ్రిడ్జి నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న శివరామకృష్ణ కేదారీఘాట్ సమీపంలో రక్షించమని అరవడంతో మత్స్యకారులు కాపాడారు. విషయాన్ని వధువు బంధువులకు చెప్పి తణుకు ప్రభుత్వాసుపత్రికి వైద్యం చేయించుకోవడానికి వెళ్లిపోయాడు. వధువు గల్లంతు కావడంతో బంధువులు గాలింపు చర్యలు చేపట్టి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో శివరామకృష్ణను పోలీసు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి వరకూ వధువు సత్యవాణి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. శివరామకృష్ణ హత్య చేశాడంటూ అనుమానాలు వ్యక్తం చేస్తూ వడలి గ్రామస్తులు భారీగా పెనుగొండ పోలీస్ స్టేషన్‌కు తరలి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. సత్యవాణిని మాయం చేయడమో, హత్య చేసి గోదావరిలో పడేయడమో చేసుంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సీఐ జీవీవీ నాగేశ్వర రావు, ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్‌లు గ్రామస్తులకు సర్ది చెప్పి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని, అనుమానాలు పెట్టుకోవద్దంటూ భరోసా ఇచ్చారు.

సత్యసాయి ఆశ్రమం బాలిక అదృశ్యం

ద్వారకాతిరుమల: సత్యసాయి ఆశ్రమంలోని ఒక బాలిక అదృశ్యంపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... భీమవరంలోని చెక్కవారి వీధికి చెందిన 11 ఏళ్ల బాలిక మండలంలోని సీహెచ్ పోతేపల్లి గ్రామంలోని శ్రీ సత్యసాయి అనాథ బాలికల ఆశ్రమంలో ఉంటోంది. ఈనెల 14న బాలిక ఆశ్రమం నుంచి వెళ్లపోయిందని.. చుట్టుపక్కల వెదికినా ఆచూకీ తెలియలేదని నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

- ఇద్దరు మృతి.. ఆరుగురికి స్వల్ప గాయాలు
- బాధితులు కైకలూరు ఆస్పత్రికి తరలింపు



శ్రీదేవి, మృతురాలు



అర్జునరావు (ఫైల్)



బస్సు ప్రమాద ఘటన దృశ్యం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ



అర్జునరావు మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

కైకలూరు/మండవల్లి: అతివేగం, ద్విచక్రవాహనదారుడిని తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు బోదెలో బోల్తా పడడంతో ఇద్దరు మృతిచెందారు. ఏలూరు – కైకలూరు రహదారిలో మండవల్లి మండలం కాకతీయనగర్ వద్ద బుధవారం జరిగిన ఈ ఘటనలో బస్సు చక్రాల కింద పడి అదే మండలం కాకతీయనగర్‌కు చెందిన కేతా అర్జునరావు(58), బోదెలో పడి భైరవపట్నంకు చెందిన చింత శ్రీదేవి(50) మరణించారు. ఏలూరు నుంచి నరసాపురం వెళ్తున్న పల్లెవెలుగు బస్సులో మొత్తం 65 మంది ప్రయాణికులు ఉన్నారు. కాకతీయనగర్ సమీపంలో బస్సుకు ఎదురుగా అర్జునరావు మోపెడ్‌పై వస్తుండగా.. అతనిని ఢీకొట్టిన బస్సు అదుపు తప్పి పక్కనే బోదెలో పడింది. అర్జునరావు అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీదేవిని ఆస్పత్రికి తరలించినా.. నీటిని తాగడంతో ఊపిరి ఆడక మృతి చెందింది. ఈ ఘటనలో బాగాల సత్యవతి(40) చాటపర్రు, గుబ్బల సారిక(35) పాలకొల్లు, బండి అన్నపూర్ణ(60) పాలకొల్లు, గడియాల శ్రీను(30) వేములదీవి, గడియాల స్వాతి(28) వేములదీవి, నక్కా రజనీ(40) సోమేశ్వరం కాలనీకి చెందిన వారికి స్వల్పగాయాలయ్యాయి. వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బస్సు డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు తెలిపారు.

తక్షణం స్పందించిన ప్రజాప్రతినిధులు

విషయం తెలుసుకుని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. క్షతగాత్రులను ఎమ్మెల్సీ వాహనంలో కైకలూరు ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే కుమారుడు దూలం శ్యామ్ ఫణికుమార్ క్షతగాత్రులకు అల్పాహారం, తాగునీటిని అందచేశారు. ఆర్డీవో ఖాజావలి, ఏలూరు ఆర్టీసీ డిపో మేనేజరు డి.వాణి, తహసీల్దార్లు మురళీకృష్ణ, రాజ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంటు దుర్గాప్రసాద్, క్షతగాత్రులను పరామర్శించారు. మృతుడు అర్జునరావు భార్య మృతిచెందగా నలుగురు కుమార్తెలున్నారు. భైరవపట్నంకు చెందిన చింత శ్రీదేవి భర్త మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. పిల్లలు లేరు. పదేళ్ల పాపను దత్తత తీసుకున్నారు.

ఇంధన పొదుపు.. భవిష్యత్‌కు మలుపు



విద్యుత్ పొదుపుపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన కలెక్టర్

ఏలూరు(మెట్రో): ఇంధన వనరులను అవసరం మేరకు పొదుపుగా వాడుకోవడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక కలెక్టరేట్ లో బుధవారం విద్యుత్ పొదుపుపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొదుపుగా ఇంధన వినియోగం తప్పనిసరి అన్నారు. గృహాలు, వాణిజ్య సముదాయాల్లో బీఈఈ స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్ ఉపకరణాలను వినియోగించుకోవడం మంచిదన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.

లింక్ క్లిక్ చేస్తే సొమ్ములు మాయం

జంగారెడ్డిగూడెం: తన బ్యాంకు అకౌంట్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నగదును చోరీ చేసినట్లు బాధితుడు జంగారెడ్డిగూడెంకు చెందిన పి.వసంత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వసంత్‌కుమార్‌కు ఈనెల 14వ తేదీన ఒక నెంబరు నుంచి పాన్‌కార్డు కేవైసీ చేయాలి లేకపోతే ఎస్‌బీఐ అకౌంట్ బ్లాక్ అవుతుందని మెసేజ్ వచ్చిందన్నారు. వివరాలు తెలుసుకునేందుకు మెసేజ్‌లోని లింక్‌ను క్లిక్‌చేశాడన్నారు. అదే రోజు సాయంత్రం వసంత్‌కుమార్ అకౌంట్‌నుంచి రూ.50 వేలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు నిర్భయంగా వేసేలా భరోసా కల్పించాలి

ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి



ఏలూరు టౌన్: రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు వారి ఓటు హక్కును నిర్భయంగా, నిస్పక్షపాతంగా వినియోగించుకునేలా భరోసా కల్పించాల్సిన బాధ్యత పోలీస్ వ్యవస్థపై ఉందని జిల్లా ఎస్పీ డి.మేరిప్రశాంతి అన్నారు. ఏలూరు అమీనాపేటలోని సురేష్ చంద్రబహుగుణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సెక్టార్ పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సెక్టార్ పోలీస్ అధికారులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని చెప్పారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులను పోలీస్ వ్యవస్థ కల్పించాలని చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే పరిస్థితులను పరిశీలిస్తూ వాటిపై ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కర రావు, ఎస్‌బీ సీఐ బీ.ఆదిప్రసాద్ ఉన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



పోటీల్లో గెలుపొంది సర్టిఫికెట్లు అందుకున్న అథ్లెట్లు

ఏలూరు రూరల్: బుధవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. పురుషులు, మహిళల విభాగంతో పాటు అండర్ 16 నుంచి 20 ఏళ్ల విభాగం వరకూ బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఇందులో 400 మీటర్ల పరుగు పందెంతో పాటు 2, 4, 6, 8 కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగుతో పాటు జావెలిన్ త్రో పోటీలు ఉన్నాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన అథ్లెట్లు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. విజయం సాధించిన అథ్లెట్లు జనవరిలో గుజరాత్‌లో జరగబోయే ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ఆంజనేయస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ



గోపినాథపట్నంలో జలాదివాసంలో క్షీరాభిషేకం చేస్తున్న దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ఉంగుటూరు : గోపినాథపట్నం ఆంజనేయస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం నిర్వహించారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కొట్టు తాతాజీ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. శిఖర ప్రతిష్ఠ అంకురార్పణ మంగళవారం సాయంత్రం జరిగింది. బుధవారం ఉదయం నుంచి పంచాగ్ని ప్రణయనం, శిఖరానికి జలాది క్షీరాదివాసం, శైనాదివాసం, మహాశాంతి హోమం నిర్వహించారు. విశేషమైన పూజలు నిర్వహించారు. ఆలయాన్ని ఇటీవల రాతితో నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించిన విషయం తెలిసిందే. పూజల అనంతరం గురువారం ఉదయం 9 గంటల సమయంలో శిఖర ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. వేలాది మందికి భోజనాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వృద్ధురాలి మృతదేహం గుర్తింపు



పట్టిసీమ రేవులో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

పోలవరం రూరల్: పోలవరం మండలం పట్టిసం రేవు గోదావరి నదిలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించినట్లు పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. వీఆర్‌వో వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నది ఒడ్డున ఉన్న మృతదేహాన్ని గుర్తించగా, ఆమెకు సుమారు 60సంవత్సరాల వయసు ఉంటుందని, తెలిపారు. స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతిచెందిందా? అన్న విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని పట్టణంలోని 24వ వార్డులో బుధవారం వార్డు ఇన్‌చార్జి యజ్జల రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, నాయకులు దత్తు కృష్ణ, మారిశెట్టి రమణ, కర్నాటి కన్నయ్య, బొద్దాని శ్రీనివాస్, దింటకుర్తి లీలావతి, పట్నాల గణపతి, చామన సూర్యచంద్రరావు, అశోక్ తదితరులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తక్షణమే ప్రతి గడపకూ సంక్షేమం పేరుతో రూ.లక్షల లబ్ధిని అందించారన్నారు. విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో కుల, మత, వర్గ పార్టీల రహితంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. సంక్షేమ పాలన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పడుతున్న తపన మరువలేనిదన్నారు. గత టీడీపీ ప్రభుత్వం పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేయడంతోపాటు 650 హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయకపోవడంతో రెండోసారి కూడా వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని లక్ష్యంతో ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో నియోజకవర్గాన్ని వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రజారక్షణకు అహర్నిశలు పాడుపడుతున్న నాయకుడు కొట్టు అని నినదించారు. మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను వలంటీర్లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చినతాడేపల్లి సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కొట్టు విశాల్



24వ వార్డు సభలో మాట్లాడుతున్న కర్రి భాస్కరరావు

సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలుద్దాం

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలిచి మళ్లీ సీఎం చేసుకుందామని వైఎస్సార్ సీపీ నాయకుడు కొట్టు విశాల్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని చినతాడేపల్లి సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గ్రామ ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథ్ అధ్యక్షత వహించారు. కొట్టు విశాల్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రావడానికి డ్వాక్రా రుణమాఫీ చేస్తానని నమ్మించి మోసగించాడన్నారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్ళ కాలంలో రెండేళ్ళు కోవిడ్ ప్రజల్ని వెంటాడిందన్నారు. అయినప్పటికీ ఇచ్చిన హామీ మేరకు కోవిడ్‌లోనూ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. మిగిలిన రెండున్నరేళ్ళుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిరాటంకంగా కొనసాగించారన్నారు. కరోనా సమయంలో ఒక్క పైసా కూడా భారం లేకుండా రాష్ట్ర ప్రజలకు వైద్యం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సమయంలో రాష్ట్ర ప్రజల గురించి ఏనాడూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆలోచించలేదని విమర్శించారు. అనంతరం సచివాలయం వద్ద సుమారు రూ.17.30 కోట్ల విలువైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దూలపల్లి సత్తియ్య, వెలిశెట్టి నరేంద్రకుమార్, పరిమి తులసీదాస్, పిచ్చుకల శ్రీనివాస్, ఆకుల ధనశేఖర్, గుల్లపల్లి ధర్మరాజు, దూలపల్లి సుమలత, కాసాని వీరరాఘవులు, తొంట రాంబాబు, పిచ్చుకల అమ్మన్నరాజు, కొక్కిరాల గోవిందరాజు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సచివాలయ కార్యదర్శి బిరుదుకోట రమేష్, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

అత్తిలి: మండల స్థాయిలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు రెండు ప్రథమ స్థానాలు దక్కాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ బుధవారం తెలిపారు. వీటిలో మొదటిది ఆటోమేటిక్ పెస్టిసైడ్ స్ప్రేయర్ కాగా, ఈ ప్రయోగాన్ని ఉపాధ్యాయుడు డీఎంజీ ప్రసాద్ నేతృత్వంలో 10వ తరగతి విద్యార్థి గారపాటి మనోహర్ తయారు చేశాడు. రెండోది ఉపాధ్యాయ వర్గంలో పాఠశాల ఎన్ఎస్ ఉపాధ్యాయుడు ఎంఎస్ఎం కృష్ణారెడ్డి అతి తక్కువ నీటితో ప్రతి రోజు నీరు పోయనవసరంలేని మొక్కల కుండిని తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దత్ ఉపాధ్యాయులు, పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం, పురుషోత్తం, హర్ష తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రుద్ర ధనరాజు కోరారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను పురస్కరించుకుని తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ అడ్డా బాబు అధ్యక్షత వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటరెడ్డి, పార్టీ తణుకు నియోజకవర్గ ఇన్‌చార్జి ఐనంపూడి శ్రీదేవి మాట్లాడారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.కిరణ్ కుమార్, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, బీజేపీ నాయకులు చింతా సుబ్బారావు, దాసరి బాబ్జి, ఎంపీటీసీలు పెనుమాక అశోక్, శ్రీనివాస్, ఉప సర్పంచ్ కడియం రాంబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి కిషోర్, సీడీపీఓ పాల్గొన్నారు.

మెడికల్ రిప్‌ల సమ్మె

తణుకు అర్బన్: మెడికల్ రిప్రజెంటేటివ్స్ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ నాయకులు వీఏ రాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త ఒకరోజు సమ్మెలో భాగంగా స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని కోర్టు ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 3 లక్షల మంది మెడికల్ రిప్‌లు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మందుల ధరలు తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని, మందులపై జీఎస్టీ తొలగించాలని, నకిలీ, నాసిరకం మందుల వ్యవహారాన్ని అరికట్టాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పిల్లల వైద్యులు డాక్టర్ వి.వెంకట రాజు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రఘు, తణుకు శాఖ కార్యదర్శి ఎం.రమేష్ బాబు సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు. ఐలూ నాయకులు కామన మునిస్వామి, సీపీఐ నాయకులు కె.భీమారావు, జనసేన లీగల్ నాయకులు అనుకుల రమేష్ సమ్మెకు మద్దతు ప్రకటించగా, కార్యక్రమంలో యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు ఐసీహెచ్ రామకృష్ణ, కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, కోశాధికారి ఐ.ఫణిబాబు, సహాయ కార్యదర్శి ఎం.శ్రీరామ్ పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

తణుకు టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్‌టీవీ రాజేశ్వరరావు చెప్పారు. బుధవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షత వహించగా, గ్రామాల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై రూపొందించిన నివేదికలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. తమకు వచ్చిన కూలి సొమ్ము నుంచి సంగం వసూలు చేసినట్లు సమావేశంలో పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పీడీ మాట్లాడుతూ సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి సొమ్ములు రికవరీ చేసి అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు బి.నరేష్, బి.మహేష్, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నేడు సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు మంగెన సూర్య తెలిపారు. ముందుగా ఉదయం 9 గంటలకు స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద కేక్ కటింగ్, అనంతరం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని రోగులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ, ఆశ్రమాల్లో భోజన వసతి కల్పించనున్నట్లు వివరించారు.

నేడు ప్రత్యేక వైద్యులు అలంపురం రాక

పెంటపాడు: అలంపురంలోని వెంకటరమణ సేవా ఆసుపత్రికి గురువారం ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కృష్ణంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు, జనరల్ సర్జన్, చర్మవ్యాధుల నిపుణులు, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి వైద్యులతో పాటు, ప్రత్యేకంగా కార్డియాలజీ, గైనకాలజీ వైద్యులు రానున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో టూడీ ఈకో, ఎక్స్‌రే, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరానికి రేషన్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులతో పాటు, పాత రిపోర్టులు తప్పక తీసుకుని రావాలన్నారు. రాజమండ్రి రాజానగరానికి చెందిన జీఎస్ఎల్ కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దూరదృష్టితోనే వైఎస్సార్ బీమా అమలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దూరదృష్టితో వైఎస్సార్ బీమా ప్రవేశపెట్టారని సీజీఎఫ్ కమిటీ సభ్యులు కర్రి భాస్కరరావు అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో ఇటీవల ప్రమాదవశాత్తు కోటిపల్లి ధర్మారెడ్డి మృతి చెందగా, కుటుంబానికి బుధవారం వైఎస్సార్ బీమా నిమిత్తం రూ.5 లక్షలు బ్యాంక్‌లో డిపాజిట్ కాగా, బ్యాంక్ స్టేట్‌మెంట్ కాపీలను కుటుంబ సభ్యులకు అందజేశారు. వార్డు ఇంచార్జి చామన సూర్యచంద్రరావు, సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ శ్రావణి, పోలీస్ సెక్రటరీ మాధురి, నాయకులు కోడే శ్రీనివాస్, ఆరిమిల్లి రవి హాజరయ్యారు.

కత్తవపాడులో ఫీవర్ సర్వే

ఇరగవరం: మండలంలోని కత్తవపాడు గ్రామంలో బుధవారం ఫీవర్ సర్వే నిర్వహించినట్లు ఇరగవరం సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దోమలు పెరగకుండా చర్యలు తీసు కోవాలని సిబ్బందికి, ప్రజలకు సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.